క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దాబాగార్డెన్స్: ఏపీఈపీడీసీఎల్ 11కేవీ విద్యుత్ హెచ్‌టీ లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జోన్–1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరితోట, జెండాచెట్టు, అచ్చియ్యమ్మపేట, భూపేష్‌నగర్, అల్లిపురం, నేరెళ్లకోనేరు, కర్ణాలవీధి, అల్లిపురం రైల్వేస్టేషన్ రోడ్డు, అల్లిపురం సిగ్నల్‌పాయింట్ ఏరియా తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కుటుంబం చెంతకు అభాగ్యుడు



రాజారావుని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధా బృందం సభ్యులు

సీతమ్మధార: రాజారావు తండ్రితో కలిసి చేపల వేటకు వెళ్తూ పని చేసుకునేవాడు. కాని అతిగా మద్యం తాగడం వల్ల మానసిక రోగిలా మారి తనలో తాను మాట్లాడుకుంటూ రోడ్ల మీద తిరిగేవాడు. మూడు సంవత్సరాల క్రితం ఊరు వదిలి కోల్‌కతా వెళ్లిపోయాడు. ఆ బాధతో రెండేళ్ల క్రితం తండ్రి చనిపోయాడు. ఆ తర్వాత రాజారావు ఏక్సిడెంట్‌లో చేతి వేళ్లు పోగొట్టుకున్నాడు. అక్కడున్న శ్రద్ధా టీం అతన్ని వైజాగ్ తీసుకొచ్చి ద్వారకానగర్‌లో గల ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహానికి అప్పగించింది. షెల్టర్ నిర్వాహకులు అతనికి వైద్యం చేయించి వివరాలు తెలుసుకున్నారు. నక్కపల్లి దగ్గర పెదతీనర్ల గ్రామంలో ఉన్న తమ్ముడు లోవరాజుకి రాజారావును శ్రద్ధా బృందం సభ్యులు గురువారం అప్పగించినట్లు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీవత్సవ్ తదితరులు

దాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్ 64వ జయంతిని పురస్కరించుకుని శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో పాతనగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. వైద్య శిబిరం పోస్టర్‌ను ద్రోణంరాజు శ్రీనివాస్ తనయుడు శ్రీవత్సవ్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. అనంతరం శ్రీవత్సవ్ మాట్లాడుతూ వైద్య శిబిరంలో అన్ని కంటి వ్యాధులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నారని, కాటరాక్ట్ శస్త్ర చికిత్సలు, కంటి మీద కండ, మెల్లకన్ను సరిచేయడం వంటి పరీక్షలు ఉచితంగా చేయనున్నారని తెలిపారు. నగర వాసులు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ వై. రాజు, ప్రసాద్, కాళ్ల సూర్యప్రకాష్, సంస్థ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

పట్టు వస్త్రాల సమర్పణకు జీవో విడుదల

దాబాగార్డెన్స్: ఆర్యవైశ్యుల కులదైవం, వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారికి పట్టు వస్త్రాలు పంపించేందుకు ప్రభుత్వం జీవో 189 విడుదల చేసిందని ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లూరు రూప ఒక ప్రకటనలో తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో వాసవీమాతకు ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని చెప్పారు. అలాగే కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో వేంచేసిన వాసవీ మాతకు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పట్టు వస్త్రాలు అందజేయనున్నారని కొల్లూరు రూప పేర్కొన్నారు.

నిలువెత్తు నిర్లక్ష్యం

- పాతనగరంలో కనిపించని పచ్చదనం
- పార్కులు.. ఉద్యానవనాలకూ కరువు
- డివైడర్ల మధ్య ఎండిపోయిన గ్రీనరీ
- పట్టించుకోని జీవీఎంసీ హార్టీ కల్చర్ అధికారులు



75 ఫీట్‌రోడ్డులో ఇలా..



వైజాగ్ సెంట్రల్ వద్ద కానరాని గ్రీనరీ

జగదాంబ: మొక్కలు పెంచుదాం.. కాలుష్యాన్ని అరికడదాం.. అంటూ అటు అధికారులు.. ఇటు నాయకులు తరచూ చెబుతుంటారు. అయితే అవన్నీ వట్టి మాటలే అని దక్షిణలోని పలు ప్రాంతాల్లో గల డివైడర్లు, రోడ్డు సైడ్ ప్రాంతాలను చూస్తే ఇట్టే అర్థమవుతుంది. నిజానికి డివైడర్ల మధ్యలో మొక్కలు నాటి పచ్చదనం పరిరక్షణకు పాటు పడాలన్నది జీవీఎంసీ లక్ష్యం. అందుకు చాలా ప్రాంతాలతో పాటు దక్షిణ నియోజకవర్గంలోని డాల్ఫిన్ హోటల్ ఏరియా, వైజాగ్ సెంట్రల్ ప్రాంతం, పోర్టు దగ్గర, రామకృష్ణా థియేటర్ కూడలి, 75 ఫీట్ రోడ్డు వరిసల్లో మొక్కలు నాటారు. ఇంత వరకు బాగానే ఉంది. ఆ తర్వాతే వచ్చింది అసలు చిక్కంతా. నాటిన మొక్కల సంరక్షణ గురించి ఎవరూ పట్టించుకోకపోవడం వల్ల అవి ఎండిపోయి పచ్చదనం కనుమరుగు అయిపోయింది.

వీఐపీలు పర్యటించే ప్రాంతాల్లోనే అభివృద్ధా?

అభివృద్ధి అనేది కేవలం విమానాశ్రయం నుంచి తెలుగు తల్లి ఫ్లైఓవర్ వరకు మాత్రమేనా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. వీఐపీలు పర్యటించే ప్రాంతాల్లోనే అభివృద్ధి చేస్తే పేదల పరిసరాలు బాగుపడేదెప్పుడు? అని నిలదీస్తున్నారు.



డాల్ఫిన్ జంక్షన్‌లోని వాటర్ ఫౌంటెయిన్ వద్ద ఎండిపోతున్న పచ్చదనం

ఏదీ శ్రద్ధ?

కాలుష్యం నుంచి రక్షణ కల్పించే పచ్చదనం పట్ల జీవీఎంసీ హార్టీకల్చర్ అధికారులు ఏమాత్రం శ్రద్ధ వహించటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. నగరంలోని కొన్ని రహదారులు, వీఐపీ కూడళ్లపై పెడుతున్న శ్రద్ధ బొగ్గు, ధూళి అధికంగా ఉండే పాతనగరంపై ఎందుకు పెట్టరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



పోర్టు దరి డివైడర్ల మధ్య ఎండిపోయిన మొక్కలు

నిర్వహణ లోపం..

నగర సుందరీకరణ పేరుతో డివైడర్ల మధ్య అందమైన పూలమొక్కలు వేసి.. డివైడర్లకు రంగులు వేస్తున్నారు. కానీ పాత నగరవాసులు ఏ పాపం చేశారో కానీ అటువంటి అభివృద్ధి ఇక్కడ ఏనాడూ చేపట్టిన పాపాన పోలేదు. నగరంలో కీలకమైన జగదాంబ, డాల్ఫిన్ హోటల్ వద్ద గల 75 ఫీట్‌రోడ్డు, జనతా బజార్, మున్సిపల్ స్టేడియం, పోర్టు నాలుగు రోడ్ల జంక్షన్, వైజాగ్ సెంట్రల్ షాపింగ్ మాల్ ఎదురుగా సుందరీకరణ కోసం డివైడర్లు ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. కానీ సక్రమ నిర్వహణ లేక ఆ పచ్చదనం అంతా ఎండి అదృశ్యమైపోయింది.

పార్కులకు కొరత..

పాతనగరంలోని జగదాంబ థియేటర్ కూడలి మొదలుకుని ఆఖరున ఉండే పాతబస్టాండ్ వరకు చెప్పుకోదగ్గ పార్కు అన్నదే లేదంటే ఎవరూ నమ్మరు. నగరంలో మొదటి టౌన్‌గా.. చరిత్రకెక్కిన ప్రాంతంగా చెప్పుకునే పాతనగరంలో ఆహ్లాదాన్ని పంచే చక్కటి ఉద్యానవనం లేదంటే ఇక్కడి ప్రజా ప్రతినిధులకు ఈ ప్రాంతమంటే ఎంత నిర్లక్ష్యమో అర్థమవుతోంది. ఒకప్పుడు పోలీస్ కమిషనర్ కార్యాలయం పక్కనే వైశాఖి జల ఉద్యానవనం ఉండేది. పాతనగరానికి ఇదే పెద్ద దిక్కు. దీనినే రూపాయి పార్కుగా కూడా పిలిచేవారు. తర్వాత నగరాభివృద్ధిలో భాగంగా అనేక పార్కులు వచ్చాయి. ఉన్న రూపాయి పార్కు నిర్వహణ లోపం కారణంగా మూలకు చేరిపోయింది. తర్వాత రామకృష్ణానగర్ వద్ద పార్కు నిర్మాణం కోసం జీవీఎంసీ ప్రణాళిక రూపొందించింది. అయితే ఏ కారణం వల్లో ఆ ప్రయత్నం విరమించుకుంది. అలాగే రామకృష్ణా థియేటర్ జంక్షన్ వద్ద కూడా ఓ పార్కు సగం వరకు నిర్మించి తర్వాత వదిలేశారు. దీంతో ఇప్పుడు అక్కడ కొందరు తమ పశువులను కట్టుకుంటున్నారు. పిల్లలు క్రికెట్ వంటి ఆటలు ఆడుకుంటుంటే.. ఆకతాయిలు మద్యం సేవించేందుకు, జూదం ఆడేందుకు వినియోగించుకుంటున్నారు.



అసలు పచ్చదనమే లేని రామకృష్ణా జంక్షన్‌లోని గ్రీన్ ఏరియాలు

ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే మొక్కలు వేస్తాం..

పాతనగరంలో పచ్చదనం పెంపొందించేందుకు మేమూ ఆసక్తిగానే ఉన్నాం. అయితే అక్కడి డివైడర్లలో మొక్కలు నాటితే పశువులు తినేయడం వల్ల బతకవు. ఇంజినీరింగ్ అధికారులు డివైడర్లకు రెండు వైపుల ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ కల్పిస్తామంటే అప్పుడు మొక్కలు వేస్తాం.

– దామోదర్, జీవీఎంసీ డిప్యూటీ డైరెక్టర్

నిర్లక్ష్యంతోనే ఫైలేరియా వ్యాప్తి



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

దాబాగార్డెన్స్: నిర్లక్ష్యం వల్లే ఫైలేరియా వ్యాధి పెరుగుతుందని జిల్లా మలేరియా అధికారి తులసి అన్నారు. వరల్డ్ నెగ్లెక్టెడ్ ట్రాపికల్ డిసీజెస్ డేను పురస్కరించుకుని జిల్లా మలేరియా విభాగం, జీవీఎంసీ సంయుక్తంగా గురువారం ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీలో ఆమె మాట్లాడారు. ఫైలేరియా వ్యాధికి కారణమైన క్యూలెక్స్ దోమలు మురుగు నీటి కాల్వల్లో పెరుగుతాయని, దోమలు పెరగకుండా చూడడం ద్వారా ఫైలేరియా వ్యాధి బారిన పడకుండా చూడవచ్చన్నారు. క్యూలెక్స్ దోమ కాటు బారిన పడిన వారికి 15 నుంచి 30 రోజుల్లో లేదా 3 నుంచి 6 నెలల్లో వాంతులతో కూడిన జ్వరం, శరీరంలో కాళ్లు, చేతులు, గుండె వంటి భాగాలు ఎర్రబడడం, వాపు వంటి లక్షణాలు కనిపిస్తాయని, అటువంటి లక్షణాలు కనిపించినప్పుడు సమీపంలో గల మలేరియా సబ్ యూనిట్ కార్యాలయానికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ తర్వాత వీలైనంత త్వరలో చికిత్స ప్రారంభించడం ద్వారా వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తి, అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, ఎంపీహెచ్‌వో శేషుబాబు, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, జీవీఎంసీ యాంటీ లార్వా ఆపరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి



మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నూర్‌బాషా ముస్లిం సేవా సంఘం ప్రతినిధులు

సీతమ్మధార: నూర్‌బాషా ముస్లింల ఖబరిస్తాన్‌లలో (శ్మశాన వాటికలు) జీవీఎంసీ అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించాలని షేక్ బురాన్, షేక్ నాగూర్, షేక్ రెహ్మాన్ గురువారం మేయర్ హరి వెంకటకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఖబరిస్తాన్ లేని చోట స్థలం కేటాయించి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలన్నారు. మదర్సాలకు ఉర్దూ టీచర్లను నియమించాలని, మాంసం వ్యాపారం చేస్తున్న వారికి కబేళా అందుబాటులో ఉండే ఏర్పాటు చేయాలన్నారు. నూర్‌బాషా ముస్లింలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో షాదీఖానాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి మేయర్ సానుకూలంగా స్పందించారు. జిల్లా రివ్యూ మీటింగ్‌లో ఈ సమస్యలను తప్పకుండా చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో షేక్ బాబ్జి, షేక్ సుభాన్, షేక్ మౌలా, షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: లెప్రసీపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం అప్పుఘర్ వద్ద గల ఫిషర్‌మెన్ కాలనీ సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని లెప్రసీ వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. శరీరంపై గల స్పర్శ లేని మచ్చల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మచ్చలను పరిశీలించడం ముఖ్యమని తెలిపారు. జిల్లా క్షయ, కుష్ఠు, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు మాట్లాడుతూ లెప్రసీ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రారంభ దశలోనే గుర్తిస్తే వ్యాధి శరీరంలో వ్యాప్తి చెందకుండా నివారించవచ్చన్నారు. వైశ్యరాజు జ్యుయలరీస్ ఆధ్వర్యంలో 30 మంది లెప్రసీ రోగులకు డ్రై రేషన్ (ఫుడ్ బకెట్ కిట్స్) సరఫరా చేశారు. ఈ కిట్లలో 5 కేజీల బియ్యం, పండ్లు, అర కిలో కందిపప్పు, బెడ్ షీట్లు ఉంటాయి. వైశ్యరాజు జ్యుయలరీస్ ఎం.డి. ఫాల్గుణరావు, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది, కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణలతకు అభినందనలు



సుగీత స్వర్ణలతను అభినందిస్తున్న డాక్టర్ శివానంద్

మహారాణిపేట: కేజీహెచ్ నర్సింగ్ విభాగంలో గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బి. సుగీతా స్వర్ణలత గురువారం సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివానంద్ స్వర్ణలతను పుష్పగుచ్ఛంతో అభినందించారు. అనంతరం నర్సింగ్ సెక్షన్ గ్రేడ్–1 పద్మావతి, గ్రేడ్–2 కల్పనా మౌళిని సైతం మర్యాద పూర్వకంగా కలిశారు. హెడ్ నర్సు నుంచి గ్రేడ్–2గా పదోన్నతి పొందిన ఆమెకు పూర్వ ఉద్యోగులు, సీనియర్లు క్యాపింగ్ సెర్మనీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ నర్సింగ్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షురాలు టి.గంగాభవానీ, కార్యదర్శి జీవీఎస్ వరలక్ష్మితో పాటు పలువురు ఈసీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ ఉద్యోగులు, సీనియర్లు నర్సింగ్ అసోసియేషన్ మాజీ ప్రతినిధులు బి. భాగ్యలక్ష్మి, వై.సుభాషిణి, శ్యామల, రోజీ, డబ్బీరు లక్ష్మితో పాటు ఆస్పత్రికి చెందిన సీనియర్ హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు సుగీతకు అభినందనలు తెలిపారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాఘ మాసోత్సవాలు ప్రారంభం



సూర్యనారాయమూర్తి మూలవిరాట్టు

అల్లిపురం: వెంకటకేశ్వర మెట్టపై వెలసిన శ్రీ సూర్యనారాయణ మూర్తి దేవాలయంలో గురువారం మాఘ మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అలివేలు మంగమ్మ అమ్మవారి దేవాలయం అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి స్వామికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం ప్రత్యేకంగా నిర్వహించారు. అనంతరం కలశ పూజ చేపట్టి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు కేశవాచార్యులు మాట్లాడుతూ 4వ తేదీన రథ సప్తమి సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఉంటాయని తెలిపారు. అదే విధంగా 8వ తేదీన భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయని, భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.26.34 లక్షలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

సీతమ్మధార: సంపత్ వినాయగర్ దేవస్థానం హుండీ లెక్కింపు గురువారం జరిగింది. దేవదాయ శాఖ తనిఖీదారులు, సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 37 రోజులకు రూ.26.34 లక్షల నగదు వచ్చింది. అలాగే 214– 800 మిల్లీగ్రాముల వెండి, పలు దేశాలకు చెందిన 368 యూఎస్ డాలర్లు, 5 సౌదీ రియాల్స్, 1 ఒమన్ రియల్, 12 సింగపూర్ డాలర్లు లభించినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.శిరీష తెలిపారు. దేవస్థానం ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్, శివజ్యోతి, శ్రీవెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవదాయ శాఖ సూపర్‌వైజర్ కె.గాయత్రి, దేవస్థానం సిబ్బంది జి.గోవింద్ రెడ్డి, డి.ఎస్. ప్రసాద్, భక్తులు, బ్యాంకు ఆఫ్ ఇండియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు న్యాయ అవగాహన అవసరం



చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ



భవ్యశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల, అధ్యాపకులు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం జరిగిన లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకట శేషమ్మ విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు లీగల్ అవేర్‌నెస్ కలిగి ఉండాలని తెలిపారు. పోక్సో, పాష్–యాక్ట్–2013పై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల, వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, వుమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ప్రతినిధులు డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ ప్రశంస తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి విద్యార్థిని ఎంపిక..

జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైన విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థిని పి. భవ్యశ్రీని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల గురువారం అభినందించారు. ఈ శిబిరం ఫిబ్రవరి 5 నుంచి 11 వరకు చండీఘడ్ యూనివర్సిటీలో జరుగుతుందని, దేశంలోని వివిధ రాష్ట్రాలు, వివిధ సంస్కృతుల మధ్య ఐక్యత, శాంతిని నిర్మించడమే ఈ శిబిరం లక్ష్యమని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి. అనూష, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు డాక్టర్ కేఎల్ శిరీష, ఎస్. అనురాధ, డాక్టర్ ఎల్. లావణ్య, డాక్టర్ హైమావతి, పలువురు అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆశీస్సులతో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం



వాసుపల్లి గణేష్‌కుమార్‌ని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అల్లిపురం: ప్రజల ఆశీస్సులతో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పష్టం చేశారు. పార్టీలో కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు అధిష్టానం పదవులు ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా దక్షిణ నుంచి పదవుల్లో నియమితులైన విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, సౌత్ బూత్ లెవల్ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రాజ్‌పాత్రుడు తదితరులు వాసుపల్లిని గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అబద్ధాలతో అధికారంలోకి వచ్చి దాదాపు 8 నెలలు గడిచినప్పటికీ ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేకపోయిందన్నారు. పవన్ కల్యాణ్ మాటల గారడీతో మభ్య పెడుతున్న విషయం ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీకి పూర్వవైభవం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

పార్టీ అధినేత జగన్‌కు సనపల కృతజ్ఞతలు..

విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా తనను నియమించినందుకు పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి సనపల రవీంద్ర భరత్ కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదవి వచ్చేందుకు తీవ్రంగా కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బాపూజీకి ఘన నివాళులు



అల్లిపురం మెయిన్‌రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న రాము తదితరులు



ప్రేమసమాజంలో జరిగిన గాంధీ వర్ధంతి సభలో పాల్గొన్న అతిథులు

అల్లిపురం: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, 33వ వార్డు నాయకుడు పచ్చిరిపల్లి రాము తదితరులు అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అహింసే ఆయుధంగా దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన బాపూ సేవలు మరువలేనివన్నారు. రాముతో పాటు స్థానికులు గాంధీజీకి నివాళులు అర్పించారు.

గాంధీ మార్గం అనుసరనీయం..

గాంధీ మార్గం అనుసరణీయమని రిటైర్డ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, ప్రొఫెసర్ ఆఫ్ సర్జియన్ డాక్టర్ జి.శాంతారావు అన్నారు. ప్రేమసమాజం మినీ సమావేశ మందిరంలో జరిగిన మహాత్మాగాంధీ వర్ధంతి సభ, కుష్ఠు నివారణా దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ప్రేమసమాజం ఉపాధ్యక్షుడు మట్టపల్లి హనుమంతరావు, సంయుక్త కార్యదర్శులు వీకే సురేష్‌కుమార్, ఎస్.గౌరీ ప్రసాదరావు, కార్యవర్గ సభ్యులు కోన జగదీశ్వరరావు, డి.సింహాచలం, కార్యదర్శి కె. హరిమోహన్‌రావు, కోశాధికారి ఎంవీవీకే గుప్త, సంయుక్త కార్యదర్శి ఎస్.గౌరీప్రసాదరావు, కార్యవర్గ సభ్యులు ఎస్.సత్యనారాయణ, ప్రేమసమాజం సిబ్బంది, కుష్ఠు శరణాలయం ఆశ్రమవాసులు, బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

సీతంపేట : నగరానికి చెందిన సాయిప్రియ రాగప్రభ సంగీత సంస్థ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. గాయనీమణులు సూర్యప్రభ, రంజిత, సుజాత, సత్యశ్రీ, స్వాతిరెడ్డి, భవానీ, రమణి, గంటి ఉష, శ్రీదేవి తదితరులు అలనాటి ఆపాత మధుర గీతాలను ఆలపించారు. కళాసంస్థల ప్రతినిధులు కొణతాల రాజు, గిరిజ శంకర్, సన్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.